దారి కాచిన మృత్యువు!

నల్లమల ఘాట్ రోడ్డు మృత్యు మార్గంగా మారింది. అభయారణ్యంలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటూ ప్రయాణికుల ప్రాణాలు బలితీసుకుంటోంది. శుక్రవారం జరిగిన బొలెరో వాహనం ప్రమాదంలో ఆదోనికి చెందిన ఐదుగురు మృత్యువాత పడగా.. మరో 13 మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయి. మూడేళ్లలో ఇది భారీ రెండో ప్రమాదం. ఇక 20 యేళ్ల క్రితం కూడా బైర్లూటీ–రోళ్లపెంట ఘాట్ రోడ్డు మలుపు వద్ద మినీ బస్సు బోల్తా పడిన ఘటనలోనూ ఎనిమిది మందికి పైగా మృత్యువాత పడ్డారు. – ఆత్మకూరు

- నల్లమల ఘాట్‌లో తరచూ రోడ్డు ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న ప్రయాణికులు


ఇటీవల ప్రమాదానికి గురైన బొలెరో వాహనం



తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్న ఎస్‌ఎన్ తండా - బైర్లూటి రహదారి

ఆత్మకూరు నుంచి విజయవాడ, శ్రీశైలం క్షేత్రానికి వెళ్లే ప్రయాణికులకు నల్లమల ఘాట్ రోడ్డు మలుపులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఈ ఘాట్ రోడ్డు ఆత్మకూరు నుంచి దోర్నాల వరకు 60 కి.మీ. ఉంది. పలు చోట్ల కొండ ఎగుడుదిగుడుతోపాటు లోయలు, భారీ మలుపులూ ఉన్నాయి. మలుపుల వద్ద ప్రమాదాలు తక్కువగానే జరుగుతున్నప్పటికీ సాధారణ మార్గంలోనే అత్యధిక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బైర్లూటీ నుంచి ఎస్‌ఎన్ తండా వరకు ఉన్న చక్కని రహదారిలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మూడేళ్లలో నాలుగు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇందులో రెండు ఘటనల్లో మృత్యువాతకు గురికాగా, మరో రెండు ఘటనల్లో గాయాలతో బయటపడ్డారు. చిన్నచిన్న ప్రమాదాలకు లెక్కే లేదు. బైర్లూటీ నుంచి దోర్నాల వరకు ఉన్న ఘాట్‌రోడ్ల అయితే మరింత ఎక్కువగా ప్రమాదాలు జరిగాయి. సింగిల్ రోడ్డు కావడంతో వాహనాలు పక్కకు దిగకపోవడం, రహదారి కింది భాగంలో గోతులుగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

బొలెరో వాహనాలు సురక్షితం కాదు


ఆర్టీఓ సత్యనారాయణరెడ్డి

ఆత్మకూరు నుంచి శ్రీశైలం, విజయవాడ ఇతర ప్రాంతాలకు ప్రయాణికులను తరలించేందుకు బొలెరో వాహనాలు సురక్షితం కాదని ఆర్టీఓ సత్యనారాయణరెడ్డి చెబుతున్నారు. శుక్రవారం ప్రమాదానికి గురైన బొలెరో వాహనం కేవలం సరుకులను తరలించడానికి మాత్రమే ఉపయోగించాలే గానీ ప్రయాణికులను తీసుకెళ్లేందుకు ఎలాంటి సురక్షితమైనది కాదు. డోన్, కోడుమూరు, ఆలూరు, ఆదోని, పత్తికొండ ఈ ప్రాంతానికి చెందిన వారు అత్యధికంగా గూడ్స్ లాంటి బొలెరో వాహనాల్లోనే ప్రయాణాలు చేస్తున్నారు. నిన్న కూడా సరుకులు తరలించే బొలెరో వాహనంలో పరిమితికి మించి దాదాపు 23 మందికి పైగా ప్రయాణిస్తూ ప్రమాదానికి గురయ్యారు. శివరాత్రి, ఉగాది ఉత్సవాల సమయంలో సరుకుల వాహనాల్లో భక్తులను తరలిస్తే జరిమానా విధిస్తామని ఆర్టీఓ అధికారులు ప్రచారం కూడా చేశారు. అయినా ఇటు వాహనదారులు కానీ.. అటు ప్రయాణికులు కానీ పట్టించుకోవడం లేదు.

సింగిల్ రోడ్డే ప్రాణాలు తీస్తోంది

ఆత్మకూరు నుంచి దోర్నాల వరకు నల్లమల అభయారణ్యంలో ఉన్న 60 కి.మీ. దూరంలో అత్యధికంగా 40 కి.మీ.కుపైగా సింగిల్‌రోడ్డు ఉండడంతో రహదారి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. రహదారికి ఇరువైపులా భారీ గుంతలు ఏర్పడడం వల్ల వాహనదారులు ఈ రహదారిలో ప్రయాణించేందుకు ఇష్టపడరు. డ్రైవర్లు తప్పని పరిస్థితుల్లో వెళ్తున్నారు. గతంలో రెండు వాహనాలు ఢీకొన్న ఘటనలు ఉన్నాయి. గుంతలను తప్పించబోయి బోల్తా పడిన వాహనాలు కూడా ఉన్నాయి. కేవలం మహాశివరాత్రి పర్వదినం సమయంలో మినహా మరెప్పుడు కూడా ఈ రహదారి అభివృద్ధికి అధికారులు తీసుకోలేదు. ఎంత పెద్ద గుంతలు పడినా పట్టించుకోవడం లేదు. వాహనాలు ప్రయాణిస్తూ గుంతలను తప్పించబోయి రోడ్డుపై బోల్తాపడిన ఘటనలు, భారీగా నల్లమలలో ట్రాఫిక్ జామ్ అయిన ఘటనలూ సర్వసాధారణం. సింగిల్ రోడ్డు అభివృద్ధి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు

ఎస్‌ఎన్ తండా వద్ద శుక్రవారం జరిగిన బొలెరో వాహన ప్రమాద ఘటనలో ఐదుగురు మృత్యువాత పడిన ఘటనలో బాధితురాలు రాములమ్మ ఫిర్యాదు మేరకు ఆత్మకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపటినట్లు ఎస్ఐ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

కుమారస్వామికి పూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో షష్ఠిని పురస్కరించుకుని శనివారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

మున్సిపల్ ఆర్వోగా వెంకటరెడ్డి



నంద్యాల(న్యూటౌన్): నంద్యాల మున్సిపల్ కార్యాలయ రెవెన్యూ ఆఫీసర్‌గా వెంకటరెడ్డి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఆంజనేయులు మార్కాపురం మున్సిపల్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. డోన్ మున్సిపల్ కార్యాలయం ఆర్వోగా విధులు నిర్వహిస్తున్న వెంకటరెడ్డిని నంద్యాల మున్సిపాలిటీకి ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఆయన్ను పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది అభినందించారు.

బాల్య వివాహాలు చేయడం నేరం

మహానంది: బాల్య వివాహాలు చేయడం నేరమని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శక్తి టీమ్ ఎస్ఐ ధనమ్మ హెచ్చరించారు. బుక్కాపురం గ్రామానికి చెందిన ఓ అమ్మాయికి బాల్య వివాహం చేస్తున్నారని సమాచారం అందుకున్న ఆమె శనివారం గ్రామానికి చేరుకుని బాలిక తల్లి నాగేంద్రమ్మ, కుటుంబ సభ్యులతో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారు. బాలికలకు వివాహం చేస్తే వచ్చే నష్టాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మౌలాలి, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

రైతుసేవా కేంద్రాల సిబ్బందితో సమావేశం


మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

కొత్తపల్లి: మండలంలోని ఆయా గ్రామాల రైతుసేవా కేంద్రాల సిబ్బందితో ఆత్మకూరు సహాయ సంచాలకులు బి.ఆంజనేయ శనివారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి కె.మహేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. రైతు సేవా సిబ్బంది వారి గ్రామాల పరిధిలోని రైతుల పొలాల్లో మట్టి నమూనాల సేకరణను పూర్తిచేయాలని సూచించారు. కౌలు రైతులను గుర్తించి వారికి పంటసాగు ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్వేయర్‌కు గాయాలు

కొలిమిగుండ్ల: మహిళా సర్వేయర్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. అంకిరెడ్డిపల్లె సచివాలయ పరిధిలో ఆదిలక్ష్మి సర్వేయర్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం తుమ్మలపెంటలో భూముల రీసర్వే చేశారు. సాయంత్రం కొలిమిగుండ్ల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సర్వేకు సంబంధించి పనులు ముగించుకున్నారు. ఏడున్నర గంటలకు స్కూటర్‌పై తాడిపత్రికి బయలుదేరారు. ఎనిమిదిన్నర గంటల సమయంలో బుగ్గ దాటాక గద్దరగుట్టపల్లె వద్దకు చేరుకోగానే గాలులు వీయడంతో స్కూటర్ అదుపు తప్పి కింద పడింది. ఈ ప్రమాదంలో ఆమె కాలికి తీవ్రగాయమైంది. స్థానికుల సాయంతో కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా సర్జరీ చేశారు.

13న మండల సర్వసభ్య సమావేశం

నందికొట్కూరు: ఈ నెల 13న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు సమగ్ర సమాచారంతో సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలన్నారు. ప్రజాప్రతినిధులు సర్వసభ్య సమావేశంలో పాల్గొనాలన్నారు.

ఘనంగా మే డే ఉత్సవం


ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

పగిద్యాల: ఘనంగా మే డే ఉత్సవాన్ని స్థానిక బస్టాండులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు చాంద్‌బాషా, మాజీ అధ్యక్షులు గౌండ ఇబ్రహీం, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు అబ్దుల్ రహిమాన్, ఉపాధ్యక్షులు మౌలాలి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


శ్రీశైలంప్రాజెక్ట్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐవైఎఫ్ కార్యకర్తలు

శ్రీశైలంప్రాజెక్ట్: ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రీశైలం ప్రాజెక్ట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద కామ్రేడ్ టి జనార్ధనరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.లక్ష్మయ్య, మాజీ కార్యదర్శి మత్తేష్ మాట్లాడుతూ యువత దేశ రక్షణలోనూ, సామాజిక సేవలోనూ ముందుండాలన్నారు. విప్లవ వీరులు సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ చూపిన మార్గంలో నడవాలన్నారు. ఈ సందర్భంగా పహల్గాంలోన జరిగిన ఉగ్రదాడిని ఖండించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు మహేష్, శివ, శ్రీను, సాయి, బాబు, చిన్నప, నరసింహ, వెంకటేష్, పీరు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

బండి ఆత్మకూరు: ఈనెల 5 నుంచి ఏర్పాటు చేయనున్న ప్రత్యేక ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.దస్తగిరి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 5, 6 తేదీల్లో సంత జూటూరు, 7, 8, 12 తేదీల్లో బండిఆత్మకూరు సచివాలయం -2లో, 13, 14 తేదీల్లో ఏ.కోడూరు గ్రామంలో, 15న కడమల కాలువ గ్రామాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

- కొత్తపల్లి: ఎదురుపాడు, ఎర్రమఠం గ్రామాల్లో 5న, కొక్కెరంచ, ముసలిమడుగు గ్రామాల్లో 6న, దుద్యాల, గోకవరం గ్రామాల్లో 7న, నందికుంట, గోకవరం గ్రామ సచివాలయాల్లో 8న ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మేరి తెలిపారు.
- జూపాడుబంగ్లా: ఈనెల 5, 6 తేదీల్లో 80బన్నూరు, పారుమంచాల గ్రామాల్లో, 7, 8 తేదీల్లో తాటిపాడు, తూడిచెర్ల గ్రామాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ గోపికృష్ణ శనివారం తెలిపారు.

విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవు


80బన్నూరులో ఒకే విద్యార్థి హాజరుకాగా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏసీడీపీఓ మంగవల్లి

జూపాడుబంగ్లా: అంగన్‌వాడీ వర్కర్లు విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఏసీడీపీఓ మంగవల్లి హెచ్చరించారు. శనివారం ఆమె జూపాడుబంగ్లా, 80బన్నూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. సకాలంలో తెరవని జూపాడుబంగ్లాలో అంగన్‌వాడీ కేంద్రం వర్కర్‌కు మెమో జారీ చేశారు. అనంతరం 80 బన్నూరులోని ఒకటి, రెండు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కేంద్రంలో ఉండాల్సిన పిల్లలకంటే తక్కువగా ఉండటంతో హాజరుపట్టికలో ఉన్న చిన్నారులందరూ కేంద్రానికి హాజరయ్యేలా చూడాలన్నారు. ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలకు వేసవి సెలవులు ఇవ్వగా ప్రస్తుతం కేంద్రాలను అంగన్‌వాడీ వర్కర్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ముఖద్వారానికి పూజ


ముఖద్వారానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: రూ.4.50లక్షలతో తాటిపాడు వీరభద్ర, చెన్నకేశవస్వామివారి ఆలయానికి నిర్మించిన ముఖద్వారానికి శనివారం బుర్రు వంశస్తులు పూజలు నిర్వహించారు. పి.లింగాపురం గ్రామానికి చెందిన బుర్రు వంశస్తులు చంద్రశేఖర్‌రెడ్డి, మరికొంత మంది రూ.4.50లక్షలతో ఆలయానికి ముఖద్వారాన్ని నిర్మించారు. ముఖద్వారం నిర్మాణం పూర్తికావటంతో అర్చకులు మురళీమోహన్ బుర్రు వంశస్తులతో పూజలు నిర్వహింపజేసి ముఖద్వారానికి గడపను ఏర్పాటుచేశారు. అనంతరం తమ ఇంటి ఇలవేల్పు వీరభద్రస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర


కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నిందని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు ఆరోపించారు. శనివారం కోనేటమ్మపల్లి గ్రామ పరిధిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించిందన్నారు. సమ్మర్ అలవెన్స్ రద్దు చేసిందన్నారు. గడ్డపార, గంప, నీటికి ఇస్తున్న అలవెన్స్‌లను కూడా ఇవ్వడం లేదన్నారు. పని చేసిన కూలీలకు ప్రతి వారం కొలతలు వేసి పే స్లిప్పులు ఇవ్వాలని కోరారు. పనుల వద్ద మజ్జిగ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీలకు వేతనాలు రూ.500 పెంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని వృథా చేయొద్దు


క్యారమ్స్ ఆటలో నిమగ్నమైన విద్యార్థులు

పగిద్యాల: సమయాన్ని వృథా చేయొద్దని లైబ్రేరియన్ మద్దమ్మ విద్యార్థులకు సూచించారు. వేసవి తరగతుల్లో భాగంగా శనివారం గ్రంథాలయంలో విద్యార్థులకు తెనాలి రామకృష్ణుడి హాస్య కథల్లోని పాలు తాగని పిల్ల కథను చదివి వినిపించారు. అనంతరం విద్యార్థులతో ఆమె మాట్లాడుతూ సమయం ఎంతో విలువైనదన్నారు. ఏ రోజు చేయాల్సిన పనులు అదే రోజే చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు క్యారమ్స్, క్రికెట్, స్కిప్పింగ్, చెస్‌పై అవగాహన కల్పించారు.

7న నవ గ్రహ విగ్రహ ప్రతిష్ట

పాములపాడు: ఈనెల 7న మండలంలోని క్రిష్ణారావుపేట గ్రామంలోని శివాలయంలో నవ గ్రహ ప్రతిష్ట, మల్లికార్జున స్వామి కల్యాణ మండపం పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు.

రెన్యూవల్ చేయించుకోండి

పాములపాడు: మండలంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల లైసెన్స్‌లను రెన్యూవల్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి దుకాణదారులకు సూచించారు. శనివారం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల వద్ద క్యూఆర్ కోడ్‌ను అతికించాలన్నారు. నిషేధిత రసాయన మందులు విక్రయించరాదన్నారు. విక్రయించే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఇద్దరికి గాయాలు

కొత్తపల్లి: ఎదురుగా వస్తున్న ఓ బైకును మరో గుర్తుతెలియని బైకు ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని పాతమాడుగుల గ్రామానికి చెందిన నాగరాజు, వెంకటనారాయణ, విజేయుడు, సుమంత్ శనివారం ఒకే బైకుపై కొత్తపల్లికి వెళ్లి పనులు ముగించుకుని స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. పెద్ద గుమ్మడాపురం గ్రామం బస్‌సెల్టర్ సమీపంలోని మలుపు వద్ద ఎర్రమఠం వైపు నుంచి వస్తున్న గుర్తుతెలియని బైకు ఢీకొంది. ప్రమాదంలో నాగరాజు, వెంకటనారాయణకు రక్త గాయాలు కాగా, మిగతా ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను అటుగా వెళ్తున్న ఆటోలోని ప్రయాణికులు ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బైక్‌పై నుంచి పడి ఇద్దరికి గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని రెడ్డిపల్లె గ్రామ సమీపంలో శనివారం మోటార్ సైకిల్ మీద నుంచి కింద పడి ఇద్దరు గాయపడ్డారు. నంద్యాలకు చెందిన మనోజ్, మరో వ్యక్తితో కలిసి మోటర్ సైకిల్‌పై అహోబిలం వెళ్లి తిరిగి వస్తుండగా రెడ్డిపల్లె సమీపంలో కుక్కలు అడ్డు రావడంతో వాటిని తప్పించే క్రమంలో అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు వారిని రుద్రవరంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లి ప్రథమ చికిత్సలు చేసిన అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కుల గణనతో బీసీలకు మేలు

పాములపాడు: కుల గణనతో బీసీలకు రిజర్వేషన్లు పెరిగి మేలు జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ దేశంలో 75 కోట్లకు పైగా బీసీ వర్గాల చిరకాల డిమాండ్‌ను కేంద్రం గౌరవించిందన్నారు. 1931లో బ్రిటీష్ ప్రభుత్వం సేకరించిన లెక్కల తర్వాత ప్రధాని మోదీ ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుందన్నారు. కుల గణన తర్వాత బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో పెంపు వంటి నిర్ణయాలు తీసుకోవాలన్నారు.

● చెత్త తొలగింపు


చెత్తను జేసీబీతో ట్రాక్టర్లలోకి నింపుతున్న దృశ్యం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో శనివారం సర్పంచు వరప్రసాదరావు చెత్త తొలగింపు పనులు చేపట్టారు. రహదారి వెంట చెత్త పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉండటంతో తొలగించినట్లు సర్పంచ్ తెలిపారు. జేసీబీతో కంపచెట్లను కూడా తొలగిస్తున్నామన్నారు.

పాత్రికేయుల వృత్తి కత్తిమీద సాములాంటింది


కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ బేబి

నందికొట్కూరు: పాత్రికేయుల వృత్తి కత్తిమీద సాములాంటిందని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కమిషనర్ పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాత్రికేయులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలాంటి వారన్నారు. నిజాన్ని నిర్భయంగా చెప్పే పత్రికలు ఉండడంతోనే భారత దేశం ముందుకెళ్తోందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పత్రికలు కీలక పాత్ర పోషించాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ నాసీర్, మేనేజర్ సుప్రలత, ఏఈ దినేష్‌కుమార్, ఆర్వో మధుసూదన్‌బాబు, ఏపీయూడబ్ల్యూజే నాయకులు నగేష్, పరమేష్, ఆంజనేయులు, జలీల్, స్వామన్న, సుబ్బన్న, రామకృష్ణ, స్వాములు, రహంతుల్లా, ఉమర్, అబ్దుల్లా, ఆర్‌జేడబ్ల్యూఏ నాయకులు శ్రీనివాసులు, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో రాయలసీమ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీనియర్ జర్నలిస్టులు శీలం శేషు, నాగరత్నం, ఎస్.కె.జలీల్, భూపాల్, రమేష్, మురహరి మల్లయ్య, వనమాల పుల్లయ్య తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. జర్నలిస్టులకు టోపీలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు చంద్రశేఖర్, శివ, బి.ఇ.రమణ, రాముగౌడ్, శ్రీను, కొత్త శివకుమార్, డేవిడ్ రాజు, అంకన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠోత్సవం


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ఆత్మకూరు/ఆత్మకూరు రూరల్: మండలంలోని నల్ల కాల్వ గ్రామంలో నూతనంగా నిర్మించిన చెన్నకేశవస్వామి, సీతారామలక్ష్మణ స్వాముల విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవం శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పునఃపూజా, దీక్షాహోమం, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, జీవమాతృకకాన్యసములు, మహాబలిదానము, తత్త్వజ్వాల, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు చేపట్టారు. అలాగే ఆలయ ఆవరణలో సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. వేద పండితులు మంగళ వాయిద్యాలతో సీతారాముల విగ్రహాలకు కంకణధార, పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాల మధ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారి కల్యాణాన్ని తిలకించారు.

కార్మిక హక్కుల్ని కాపాడుకుందాం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు: కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజశేఖర్, మండల కార్యదర్శి వీరన్న అన్నారు. శనివారం ఏకలవ్యనగర్‌లో మే డే వారోత్సవాల సందర్భంగా ఏపీ రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. మహిళలకు మ్యూజికల్ చైర్, చిన్నారులకు లెమన్ స్పూన్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు చందావారి వెంకటేశ్వర్లు, మహిళా సంఘం నాయకురాలు దాసమ్మ, మనెమ్మ, స్వర్ణ, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

కరివేనలో మేడే సంబరాలు..

ఆత్మకూరు: మండలంలోని కరివేన గ్రామంలో శనివారం మే డే వారోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నరసింహనాయక్, జిల్లా నాయకులు ఎ.రణధీర్, మండల నాయకులు చందావారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని సీపీఎం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పని దినాలను కొనసాగించాలన్నారు. మేడే స్ఫూర్తితో హక్కుల సాధన కోసం కార్మిక వర్గం ఉద్యమించాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మిక, ప్రజల హక్కులను హరించి వేస్తూ రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్‌నాయక్, వీరన్న, రాఘవేంద్ర, శ్రీనివాసులు, నాగేంద్రుడు, నరసింహులు పాల్గొన్నారు.